వర్షం నీరు పోయే దారేది?

- చిన్నపాటి వర్షానికే బురదమయంగా రోడ్లు
- రాకపోకలకు తప్పని తిప్పలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని పలు ప్రాంతాల్లో చిన్నపాటి వర్షానికే రోడ్లపై వర్షం నీరు నిలిచిపోతుంది. రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. దీంతో రోడ్లు త్వరితగతిన పాడవుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే బావాజీపేట డీమార్ట్ సమీపంలోను, అయోధ్యనగర్ మెయిన్‌రోడ్డు, అయోధ్యనగర్ నుంచి న్యూ ఆర్‌ఆర్‌పేట మార్గంలోని రైల్వే ట్రాక్ సమీపంలోను, మధురానగర్ రైల్వేస్టేషన్ రోడ్డు, సత్యనారాయణపురం బాబూరావు మేడ రోడ్డు, పసుపుతోట వాటర్ ట్యాంక్ సమీపంలో వర్షం నీరు రోడ్లపై నిలిచిపోతుంది. ఇక్కడ వర్షం నీరు ఎండకు ఎండాల్సిందే తప్ప బయటకు పోయే మార్గం లేదు. చిన్నపాటి వర్షానికే రోడ్లపై వర్షం నీరు నిలిచిపోవటంతో పాటు రోజుల తరబడి నిలిచిపోవటంతో వాహనచోదకులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. కొన్ని మార్లు వీఎంసీ అధికారులు రోడ్లపై నిలిచిన వర్షపునీటిని తొలగిస్తున్నప్పటికీ ఇంకా నీరు రోడ్లపై నిలిచే ఉంటున్నాయి. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారటంతో పాటు దోమలు సైతం పెరిగిపోతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

శాశ్వత చర్యలు ఏవీ?

నగరంలో వర్షం నీరు రోడ్లపై నిలిచిపోకుండా తాత్కాలిక చర్యలతో సరిపెట్టకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు. వర్షం నీరు నిలిచిపోవటంతో రాకపోకలు సాగించే క్రమంలో రాత్రిపూట చీకటిలో ప్రమాదాలు సైతం జరుగుతున్నాయని వాహనచోదకులు ఆరోపిస్తున్నారు. ఎక్కడికక్కడ మురుగుకాలువలను స్వార్థ ప్రయోజనాల కోసం మూసివేస్తున్నారు. దీంతో వర్షం నీరు పోయే మార్గం లేక రోడ్లపైనే నిలిచిపోతుందని వాపోతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మురుగు కాలువలను సరిచేయాలని నగరవాసులు కోరుతున్నారు.



బావాజీపేట డీ మార్ట్ సమీపంలో నిలిచిన వర్షం నీరు



అయోధ్యనగర్ బుడమేరు కట్ట నుంచి ఆర్‌ఆర్‌పేట మార్గంలో రైల్వేట్రాక్ వద్ద బురదగా మారిన రోడ్డు

అదుపులోకి రాని 'డయేరియా'



వైఎస్సార్ సీపీ నిజనిర్ధారణ కమిటీ సభ్యులకు తమ బాధలను వివరిస్తున్న ప్రజలు



డయేరియా బాధితులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నిజనిర్ధారణ కమిటీ సభ్యులు

- ఆదివారం 100 మంది బాధితులకు పరీక్షలు
- 16 మందికి డయేరియా లక్షణాలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): 'డయేరియా' వలయంలో చిక్కుకున్న విజయవాడ 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేటలో ఐదో రోజూ అవే 'కన్నీళ్లు' కనిపించాయి. ఇంకా వాంతులు, విరేచనాలు, ఇతర అనారోగ్య సమస్యలతో జనం ఇబ్బంది పడుతూనే ఉన్నారు. ఆదివారం 100 మంది వరకూ బాధితులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 16 మందికి పైగా డయేరియా లక్షణాలు ఉన్నట్లు తేలింది. దీంతో వైద్యాధికారులు వారిని వైద్య శిబిరంలో చేర్చుకొని చికిత్స అందిస్తున్నారు.

ప్రతి ఇంట్లో ఆ'వేదన'లే

న్యూఆర్‌ఆర్‌పేటలో ఏ ఇంటిని కదిలించిన ఇంకా డయేరియా లక్షణాలతో బాధపడుతున్న బాధితుల ఆవేదనలే కనిపిస్తున్నాయి. కొంతమంది బాధితులు వైద్య శిబిరాల్లో చేరి నాలుగు రోజుల తరువాత ఇళ్లకు వచ్చినా కూడా ఇంకా వారు అవే ఇబ్బందులతో నీరసించిపోతున్నారు. అదేమని వైద్యులను అడిగితే మొత్తం ఆరు రోజుల వరకూ మన శరీరంలో అవి పనిచేస్తాయని, భయపడాల్సిందేమి లేదని చెప్పి పంపేస్తున్నారని, ఏ సమయంలో ఏమి జరిగిద్దోనని తమకు ఆందోళనగా ఉంటుందని పలువురు బాధితులు వాపోతున్నారు.

కుళాయిల్లో రంగు మారిన నీళ్ల సరఫరా

న్యూరాజరాజేశ్వరీపేట ప్రాంతంలో ఇంకా తాగునీటి కుళాయిల నుంచి వచ్చే నీరు రంగు మారే వస్తోంది. ఈ నీటిని ఇళ్లల్లో వాడుకున్నా.. స్నానాలకు వాడుకున్నా మళ్లీ ఏ వ్యాధులు వస్తాయోనని తమకు భయంగా ఉందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. న్యూఆర్‌ఆర్‌పేటలో ఆదివారం పర్యటించిన వైఎస్సార్ సీపీ నిజనిర్ధారణ కమిటీ సభ్యులకు స్థానిక ప్రజలు, బాధితులు ఇదేవిధంగా అనేక సమస్యలను విన్నవించుకున్నారు. వారం రోజుల నుంచి పనులు మానేసి, హాస్పిటల్స్‌లోనే ఇంటిల్లపాది నరకయాతనను అనుభవిస్తున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తంచేశారు.

ఉన్నతాధికారుల సేవలకే అధికారులు పరిమితం

'డయేరియా' ప్రాంతంలో విధి నిర్వహణలో పాల్గొంటున్న అధికారులు, సిబ్బంది కేవలం ఉన్నతాధికారులకు సేవ చేయడమే సరిపోతుంది తప్ప.. వాస్తవంగా బాధితులకు సేవలు అందించడం లేదనే విమర్శలున్నాయి. కార్పొరేషన్ పరిధిలోని ఆరోగ్య, పారిశుద్ధ్య, మలేరియా, తాగునీటి సరఫరా శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది కేవలం ఉన్నతాధికారుల మెప్పు కోసం వారి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సిబ్బంది పనితీరుపై ప్రత్యేక దృష్టిపెట్టి ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

నీరసంగా ఉంటోంది



నాలుగు రోజుల క్రితం డయేరియా బారిన పడ్డాం. అప్పటి నుంచి వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిలో చేరి చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చాం. వచ్చిన దగ్గర నుంచి మళ్లీ అవే లక్షణాలు కనిపిస్తున్నాయి. ఒంట్లో చాలా నీరసంగా ఉంటోంది.

– బి.రమణ, గృహిణి, న్యూఆర్‌ఆర్‌పేట

చాలా భయంగా ఉంది



మూడు రోజుల నుంచి వాంతులు, విరేచనాలతో సతమతమవుతున్నాం. ప్రభుత్వ ఆస్పత్రిఓ చికిత్స చేయించుకున్నా. ఆస్పత్రిలో సరిగా పట్టించుకోవడం లేదని శనివారం ఇంటికి వచ్చేశాం. ఇంటికి వచ్చాక మళ్లీ అదేవిధంగా వాంతులు అవుతున్నాయి. ఎప్పుడు ఏమి జరుగుతుందో అని చాలా భయంగా ఉంది.

– నల్లమోతు కోటేశ్వరరావు, కార్మికుడు, న్యూఆర్‌ఆర్‌పేట

పండుగలతో బంధాలు పటిష్టం

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): పండుగలతో బంధాలు పటిష్టం అవుతాయని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. స్థానిక 29వ డివిజన్ మధురానగర్ నేతాజీ కాలనీలో ఆదివారం వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా బోనం నాగు ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులకు భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించటంతో పాటు ఇప్పుడు నాలుగు వేల మందికి అన్నదానం చేయటం అభినందనీయమని పేర్కొన్నారు. గణనాథుడి ఆశీస్సులు ప్రతిఒక్కరికీ అందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బోనం నాగు ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు బోనం నాగు, సంపత్, కొంగితల గోపి, అనిల్, వైఎస్సార్ సీపీ నాయకులు కంభం కొండలరావు, బోను పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కార్మిక సంఘాలు ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సూచించారు. స్థానిక గాంధీనగర్‌లోని విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ హాల్లో ఆదివారం ఎల్పీజీ గ్యాస్ కంపెనీ వర్కర్స్ యూనియన్ 16వ మహాసభ జరిగింది. ముఖ్య అతిథిగా మల్లాది విష్ణు మాట్లాడారు. అధికారంలో ఉన్నా.. లేకపోయినా ప్రజల పక్షాన నిలిచిన వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. పేద ప్రజలు సామాన్యులు ఏ ప్రభుత్వాలు ఏ రకంగా పనిచేశాయనేది ఒకసారి ఆలోచించాలన్నారు. జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఇళ్ల స్థలాలు ఇవ్వడం, ఇళ్లు కట్టించడం, అనుకోకుండా ఏదైనా ఆపద ఎదురైన పరిస్థితుల్లో ప్రభుత్వం చేదోడువాదోడుగా ఉందని గుర్తు చేశారు. తాము వైఎస్సార్ సీపీ పక్షాన ప్రజలకు అండగా ఉంటామని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి కత్రి దుర్గాప్రసాద్, చిరుమామిళ్ల గిరిజా శంకర్, గద్దె హరిబాబు, నిమ్మగడ్డ సుబ్బారావు, త్రిమూర్తి రాజు, పోట్లూరి శ్రీనివాసరావు, మల్లాది రాజేంద్రప్రసాద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



నేతాజీ కాలనీలో భోజనాలు వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నిర్వాహకుడు బోనం నాగు



గ్యాస్ వర్కర్ల సభలో మాట్లాడుతున్న మల్లాది విష్ణు

అతిసార కట్టడిలో ప్రభుత్వం వైఫల్యం

వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్

లబ్బీపేట(విజయవాడతూర్పు): న్యూ రాజరాజేశ్వరీపేటలో ప్రబలిన అతిసార కట్టడిలో కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్ అన్నారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. ఐదు రోజులుగా ఆ ప్రాంతంలో అతిసార కేసులు నమోదవుతున్నా, కారణం తెలుసుకుని అరికట్టలేక పోయారన్నారు. ఆ ఫలితంగా వందలాది మంది డయేరియా బారిన పడ్డారన్నారు. అధికారిక లెక్కల ప్రకారం 300 మంది ఉంటే, అనధికారికంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లోలో చికిత్స పొందిన వారు మరింత ఎక్కువ మంది ఉన్నారని ఆయన తెలిపారు. అతిసారకు కారణాన్ని ఇంత వరకూ ప్రకటించలేక పోయారన్నారు. తొలుత వినాయక చవితి భోజనాలని, వంకాయ కూరంటూ మంత్రులు కట్టుకథలు చెప్పారన్నారు. కానీ ప్రభుత్వం సరఫరా చేసే మంచినీరు కలుషితం కావడం వలనే డయేరియా వ్యాప్తి చెందిందని ఆయన అభిప్రాయపడ్డారు. నీరు కలుషితం అయినప్పుడే వందల సంఖ్యలో డయేరియా కేసులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలు మానీ, చిత్తశుద్ధితో డయేరియాను అరికట్టేందుకు కృషి చేయాలని హితవు పలికారు. ఆస్పత్రిల్లో చికిత్స పొందుతున్న వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆయన సూచించారు.



మధురంగా త్యాగరాజ స్వామి కృతులు

విజయవాడ కల్చరల్: జేఎంఎస్ నాట్యవేద అకాడమీ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ ఆధ్వర్యంలో మొగల్రాజపురంలోని పీబీ సిద్దార్థ అకాడమీలో ఆదివారం నిర్వహించిన సంగీత, నాట్య సమ్మేళనం సమ్మోహనంగా సాగింది. జంగం శ్రీనివాస చక్రవర్తి, విజయకుమార్ ఆధ్వర్యంలో మూడు గంటలపాటు జరిగిన స్వర, లయ, నాట్యవిన్యాసం ఆకట్టుకుంది. సంప్రదాయ సంగీత కార్యక్రమంలో భాగంగా నాట్యవేద విద్యార్థులు అన్నమయ్య, రామదాసు, త్యాగరాజ స్వామి కృతులను మధురంగా ఆలపించారు. గురు శిష్య మృదంగ సంవాద కార్యక్రమంలో మృదంగ విద్వాంసుడు అమ్ముల ప్రసాద్ జగం శిరీషా చక్రవర్తి నిర్వహించిన లయ విన్యాసం కార్యక్రమం ఆకట్టుకుంది. నాట్య అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. సంగీత విద్వాంసులు అన్నవరపు రామస్వామి, వేదపండితులు డాక్టర్ వేదాంతం రాజగోపాల చక్రవర్తి, వయోలిన్ విద్వాంసుడు పాణ్యం దక్షిణామూర్తిని పాల్గొని ప్రతిభ చూపిన కళాకారులకు బహుమతులను అందజేశారు.



సంప్రదాయ కీర్తనలను ఆలపిస్తున్న చిన్నారులు

డయేరియా నివారణలో కూటమి ప్రభుత్వం విఫలం

సీపీఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి, మాజీ ఎంపీ మధు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): విజయవాడలో డయేరియాను నివారించడంలో కూటమి ప్రభుత్వం ఘోర వైఫల్యం చెందిందని సీపీఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి, మాజీ ఎంపీ పి.మధు పేర్కొన్నారు. 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేటలోని డయేరియా బాధితులను ఆదివారం ఆయన సీపీఎం నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయేరియా బాధితులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. డయేరియాతో ఇప్పటికి ఆరుగురు చనిపోయారని, వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

అధికారులతో వాగ్వాదం

డయేరియాతో బాధపడుతున్న న్యూరాజరాజేశ్వరీపేట ప్రాంతంలోని పేదలకు భోజనాలు పెట్టేందుకు సీపీఎం ముందుకు వచ్చింది. వాటర్‌ట్యాంక్ రోడ్డులో భోజనాలను స్థానికులు పెట్టాలని చూస్తుండగా కార్పొరేషన్ అధికారులు సీపీఎం నాయకులను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో సీపీఎం నాయకులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. నాయకులు మాట్లాడుతూ 'మీరు డయేరియా బాధితులకు సరైనే సేవలే అందించడం లేదని.. ఆకలితో అలుమటిస్తున్న బాధితులకు మేము పెడుతుంటే ఎలా అడ్డుకుంటారు' అని అధికారులను ప్రశ్నించారు.



బాధితులను పరామర్శిస్తున్న మధు, సీపీఎం నాయకులు

సంక్షిప్త వార్తలు

విద్యార్థులకు మాతృభాషపై అవగాహన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాతృభాషను నేర్చుకోవటంతో సంస్కృతి సంప్రదాయం, సాహిత్యం తెలుసుకోవటంతో పాటు పాఠ్యాంశాలు కూడా సులభంగా అర్థం చేసుకోవచ్చని తెలుగు ఉపాధ్యాయురాలు వల్లభనేని సుమతి అన్నారు. స్థానిక బందర్ రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో ఆదివారం 'చదవటం మాకు ఇష్టం' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మాతృభాషపై అవగాహన కార్యక్రమం జరిగింది.

పుస్తకాల పంపిణీ

విద్యార్థులకు అక్షరాలు నేర్పించడం, చదవటం రాయటం, డిక్టేషన్ మొదలగు అంశాల్లో శిక్షణ ఇస్తున్న టీచర్ వల్లభనేని సుమతి తన కుమారుడు వల్లభనేని వంశీ (అమెరికా) కోరిక మేరకు ఆదివారం అక్షరాలతో కూడిన పదాలు నేర్చుకునే పుస్తకాలను బహుకరించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ రమాదేవి మాట్లాడుతూ మాతృభూమి, మాతృభాష మీద మక్కువతో వల్లభనేని వంశీ అమెరికాలో ఉండి కూడా ఇక్కడ విద్యార్థులకు పుస్తకాలు అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మూగబోయిన సింగ్‌నగర్, న్యూఆర్‌ఆర్‌పేట

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): 57వ డివిజన్‌లో నెలకొన్న డయేరియా సమస్య రోజురోజుకు పెరుగుతుండడంతో అధికారులు రెండు రోజుల నుంచి న్యూఆర్‌ఆర్‌పేట, సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, పాయకాపురం పరిసర ప్రాంతాల్లోని దుకాణాలను శనివారం సాయంత్రం నుంచి మూసివేయించారు. ఆదివారంతో పాటు తాము చెప్పే వరకూ మాంసం దుకాణాలు కానీ, హోటళ్లు కానీ, వైన్ షాపులు కానీ తెరవడానికి వీలులేదని ఆదేశాలు జారీ చేశారు. దీంతో నిత్యం వేలమంది రాకపోకలతో కళకళలాడే సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్ ప్రధాన రహదారి, న్యూఆర్‌ఆర్‌పేట, బస్టాప్ ప్రాంతం మూగబోయినట్లు కనిపించింది.

మాంసం స్వాధీనం

డయేరియా కారణంగా దుకాణాలను తీయొద్దంటూ అధికారులు వ్యాపారులకు సూచించారు. అయితే పలువురు వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా ఉదయం పూట దుకాణాలు తెరచి మాంసం విక్రయిస్తుండడంతో ఫుడ్ సేఫ్టీ, కార్పొరేషన్ అధికారులు వారిని గుర్తించి ఆ దుకాణంలో లభించిన మాంసాన్ని స్వాధీనం చేసుకొని బ్లీచింగ్ చల్లి నిర్వీర్యం చేశారు. అయితే సాయంత్రానికి పలు మాంసం దుకాణాలు, హోటళ్లు యథేచ్ఛగా షాపులను తెరిచి వ్యాపారాలు సాగించారు.

వాహనాల తనిఖీల్లో ఉద్రిక్తత

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగరంలోని బీఆర్టీఎస్ రోడ్డులో ట్రాఫిక్ పోలీసులు వాహనాలను తనిఖీ చేసే క్రమంలో ఆదివారం రాత్రి ఇద్దరు యువకులు, ఎస్‌ఐ మధ్య వాగ్వాదం నెలకొనడంతో ఉద్రిక్త పరిస్థితికి దారితీసింది. బీఆర్టీఎస్ రోడ్డు, ఫుడ్ జంక్షన్ వద్ద మూడవ ట్రాఫిక్ ఎస్‌ఐ కుమార్ వాహనాలు తనిఖీలు చేస్తున్న క్రమంలో ఇద్దరు యువకులు హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనంపై రావటంతో పోలీసులు అడ్డుకున్నారు. వాహనచోదకుడికి సంబంధించి మూడు పెండింగ్ చలానాలు ఉండటంతో వాటితో పాటుగా హెల్మెట్ లేకుండా వాహనం నడిపినందుకు కలిపి మొత్తం చెల్లిస్తేనే వాహనం ఇస్తామని పోలీసులు చెప్పారు. దీంతో యువకులు వారి తండ్రికి ఫోన్ చేయగా అతను మద్యం మత్తులో పోలీసుల వద్దకు వచ్చి ఎస్‌ఐతో వాగ్వాదానికి దిగాడు. దీంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిషోర్‌బాబు అక్కడకు చేరుకుని ఎస్‌ఐ చేత వారికి క్షమాపణలు చెప్పించడంతో గొడవ సద్దుమణిగింది.

ఆటిజాన్ని తొలి దశలోనే అడ్డుకోవాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆటిజం గర్భం నుంచే మొదలవుతుందని, ఆటిజం పిల్లల జీవితంలోకి ప్రవేశించకముందే దాన్ని అడ్డుకోవాలని రెస్ప్లెస్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ తొడుపునూరి సూచించారు. ఆదివారం ఐకాన్ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో ఉచిత ఆటిజం చికిత్స శిబిరం జరిగింది. తొలుత ఆటిజం శిబిరాన్ని ఐకాన్ విద్యాసంస్థల అధినేత రాజేంద్ర ప్రారంభించారు.

విమలకుమారి మృతి సాహితీ ప్రపంచానికి తీరనిలోటు

విజయవాడ కల్చరల్: సాహితీవేత్త అనువాదకురాలు కోకా విమలకుమారి మృతి సాహితీ ప్రపంచానికి తీరనిలోటు అని ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి అన్నారు. నగర సాహితీ సంస్థలు, ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ ఆధ్వర్యంలో రచయిత్రి, పరిశోధకురాలు విమలకుమారి సంస్మరణ సభను హోటల్ ఐలాపురంలో ఆదివారం నిర్వహించారు. చలపాక ప్రకాష్, డాక్టర్ వెన్నావల్లభరావు, డాక్టర్ జీవీ పూర్ణచందు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, సత్యవతి, బోడి ఆంజనేయరాజు, సీహెచ్ వీ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులు రాజకీయంగా అభివృద్ధి సాధించాలి



విజయవాడ కల్చరల్: బ్రాహ్మణులు రాజకీయంగా ఎదిగి సమాజసేవ చేస్తూ ప్రగతి సాధించాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి పేర్కొన్నారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని హనుమాన్‌పేటలోని రాజరాజేశ్వరి కల్యాణ మండంపంలో ఆదివారం నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ బ్రాహ్మణులు సమాజసేవలో భాగస్వాములు కావాలన్నారు. గన్నవరం విమానాశ్రయానికి పింగళి వెంకయ్య పేరుపెట్టాలని సభ్యులు తీర్మానం చేశారు. నిరంతరం బ్రాహ్మణ సంక్షేమానికి కృషి చేస్తున్న బలరామకృష్ణమూర్తిని శంకర మఠం రాజరాజేశ్వరి కళాపీఠం ట్రస్ట్‌కు అధ్యక్షుడిగా నియమించాలని సభ్యులు డిమాండ్ చేశారు. పూర్వపు అధ్యక్షుడు ముత్తనపల్లి శివకృష్ణ ప్రసాద్, శ్రీనివాసరావు, వేదం శ్రీహరి ఉమామహేశ్వరరావు తదితర సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడకల్చరల్: విశ్వశాంతి ఆర్ట్స్ అకాడమీ గుంటూరు ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్త పూర్ణానందం కళావేదికమీద ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి, సాహితీ సంస్థల ప్రతినిధులకు ఆత్మీయ సత్కార కార్యక్రమం వైభవంగా జరిగింది. గాదే రత్నరెడ్డి ఆధ్వర్యంలో విజయలక్ష్మి, సౌజన్య, వెంకరమణ, దయామణి, రవికిరణ్ తదితరులు పలు చిత్ర గీతాలను ఆలపించారు. నగరానికి చెందిన సాహితీ సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, కే డేవిడ్‌రాజు, నరసింహారావు, పరుచూరి విజయలక్ష్మిని నిర్వాహకుల పక్షాన విశ్వశాంతి ఆర్ట్స్ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి సత్కరించారు.



'మరుపురాని మహనీయులు' గ్రంథావిష్కరణ

విజయవాడకల్చరల్: విఖ్యాత రచయిత, కాలమిస్ట్ నాగసూరి వేణుగోపాల్ రచించిన 'మరుపురాని మహనీయులు' గ్రంథావిష్కరణ పరిచయ సభ ఏలూరురోడ్డు సాయిమందిరం సమీపంలోని నాగాలాండ్‌లో ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న చినుకు మాసపత్రిక సంపాదకులు మహనీయులు జీవితాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వేణుగోపాల్ రచించిన అనేక పుస్తకాలు పాఠకుల ఆదరణకు నోచుకున్నాయన్నారు. విశ్రాంత ఆకాశవాణి సంచాలకులు మంజులూరి కృష్ణకుమారి మాట్లాడుతూ వేణుగోపాల్ సాహిత్యాజీవితాన్ని, ఆకాశవాణిలో ఆయన నిర్వహించిన ప్రయోగాత్మక కార్యక్రమాలను వివరించారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): స్థానిక సింగ్‌నగర్‌లోని మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో బ్యాడ్మింటన్ జోనల్ జోనల్ స్థాయి పోటీలు ఆదివారం జరిగాయి. ఈ పోటీల్లో సింగిల్స్, డబుల్స్ అండ్ మిక్స్‌డ్ డబుల్స్‌లో షేక్ అమీనా విజేతగా నిలిచింది. పోటీల్లో ప్రతిభ చూపిన షేక్ అమీనాకు అతిథులు మెడల్స్‌ను అందజేశారు.

క్లుప్తంగా

గాయత్రి సొసైటీ సేవలు అభినందనీయం



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): పేద బ్రాహ్మణులకు చేయూత అందించే దిశగా సేవా కార్యక్రమాలు చేపడుతున్న గాయత్రి సొసైటీ సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. ఆదివారం గాయత్రి సొసైటీ ఆధ్వర్యంలో పేద బ్రాహ్మణులకు నిత్యావసర సరుకులను తెలంగాణా రాష్ట్ర పోలీస్ కంప్లెంట్ అథారిటీ చైర్మన్ జస్టిస్ బలుసు శివ శంకరరావుతో కలసి మల్లాది విష్ణు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాయత్రి సొసైటీ వారు భవిష్యత్తులో మరేన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ మేయర్ జంధ్యాల శంకర్, ప్రముఖ న్యాయవాది లోక్‌నాథ్‌శర్మ, నోరి సూర్యనారాయణ, గాయత్రి సోసైటీ కోశాధికారి జె.కె. సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకుడు దోనేపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా నాగుల్‌మీరా



పాయకాపురం(విజయవాడరూరల్): ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా షేక్ నాగుల్ మీరా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం కండ్రిక కార్యాలయంలో రాష్ట్ర సహాయకార్యదర్శి షేక్ మస్తాన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో షేక్ నాగుల్ మీరాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాగుల్‌మీరా మాట్లాడుతూ సభ్యులు సహాయ సహకారాలతో సేవాకార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళతానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీ పేద జంటలకు వివాహం చేసుకునే దానికి రూ.లక్ష తోఫా అందజేయాలన్నారు. సమావేశంలో ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మౌలానా సాజిద్ అలీ, ఉపాధ్యక్షుడు కాలేషా, నగర అధ్యక్షుడు సిలార్ బేగ్, అవనిగడ్డ నియోజకవర్గం ఇన్‌చార్జి అబ్దుల్ అజీజ్, గన్నవరం నియోజకవర్గ సభ్యుడు సత్తార్, నగర మహిళా ప్రధాన కార్యదర్శి గుల్ నాజ్ బేగం, రజియా తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో కుల గణన చేపట్టి బీసీ జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లాకా వెంగళరావు యాదవ్ డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు రక్షణ చట్టం కల్పించాలన్నారు. కేంద్ర స్థాయిలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, మహిళా బిల్లులో బీసీ మహిళకు ప్రత్యేక స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నరసరావు, ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, నాయకులు యలమందరావు, బీఎస్సార్ యాదవ్, పద్మావతి, నగేష్, నాగమల్లేశ్వరరావు, గీత, నాగుల్ మీరా పాల్గొన్నారు.

ఆరోగ్య పరిస్థితులపై ఇంటింటి సర్వే

పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు పాయకాపురం, కండ్రిక, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. న్యూ రాజరాజేశ్వరిపేటలో నాలుగు రోజులుగా డయేరియా ప్రభావంతో అనేక మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న నేపథ్యంలో వీఎంసీ కమిషనర్ ఇంటింటి సర్వే చేయాలని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బందిని ఆదేశించారు. దీంతో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు 61, 62, 63, 64 డివిజన్లలో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరిస్థితులపై సర్వే చేసి రిపోర్టులను వీఎంసీకి అందజేస్తున్నారు. సర్వేలో వైరల్ ఫీవర్స్ అధికంగా ఉన్నట్లు వైద్య సిబ్బంది గుర్తించారు. కాగా కండ్రిక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి డాక్టర్ లేకపోవడంతో అత్యవసర పరిస్థితులను బట్టి జక్కంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కండ్రికలో బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు.

ముగిసిన మండలాభిషేక మహోత్సవాలు

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణమండపంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న మండలాభిషేక మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి మాట్లాడుతూ టీటీడీ అనుబంధ ఆలయాల్లో 12 సంవత్సరాలకు ఒకసారి మహాసంప్రోక్షం అనంతరం మండలాభిషేకం ఆగమోత్తంగా నిర్వహించడం జగిందన్నారు. ఆలయ పర్యవేక్షకులు మల్లికార్జున, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.